ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు 2





వైభవంగా బ్రహ్మోత్సవాలు 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## రైతులకు నాణ్యమైన విద్యుత్: ట్రాన్స్‌కో ఎస్ఈ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు సుమారు 978 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. పంటల కోతకాలం ముగియడంతో రైతుల అవసరాల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన అత్యధిక సంఖ్యలో సర్వీసులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నా. కొత్త వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో వేగంగా పనిచేస్తున్నామని క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు వైర్లు ట్రాన్స్‌ఫార్మర్లు ఇతర అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.





## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అరాచకాలను బయటపెడతాం: కేటీఆర్

**అక్షరటుడే, ఆర్మూర్ :** బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అరాచకాలను ఒక్కొక్కటిగా బయటపెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తూ ఆర్మూర్‌లో ఆగారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లో ఆగిన కేటీఆర్‌ను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. పెంచిన పెన్షన్‌లను వెంటనే విడుదల చేయాలని అదే విధంగా కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అందజేయాలని రైతులకు అడిగితే బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, పార్టీ కౌన్సిలర్లు గుంజులు పృథ్వీ, నదీం, అజీం, సీనియర్ నాయకులు పోల సుధాకర్, మహేష్, ఎంజె రాము జనపల్లి రంజిత్, రోహిత్ ప్రవీణ్ గౌడ్, షరీఫ్ సత్తార్, ఇనేక్ ఫాల్ బబ్లు, మట్టెల ప్రవీణ్, మోహన్, జీజీ రామ్, మెట్టు సంతోష్, సుధాకర్, వేణు, కళ్యాణ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.




## కామారెడ్డిలో విద్యాసంస్థల ఏర్పాటుపై దృష్టి పెట్టండి..

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులపై ఆరోపణలు మానుకుని కళాశాల స్థలాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకు నాయకులు కృషి చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణ కోసం రాజకీయ నాయకులు కృషి చేయాలన్నారు. కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. అరోరా ఇంజినీరింగ్ కళాశాల, సరస్వతి శిశు మందిర్ పాఠశాల, కర్షక్ బీఈడీ కళాశాలకు నాడు స్థలాలను ఎలా కేటాయించారని ప్రశ్నించారు. అలాగే అక్రమంగా స్థలాలను కబ్జా చేసుకుని కట్టడాలు చేసినా ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. అరోరా కళాశాల, సరస్వతి శిశు మందిర్, కర్షక్ బీఈడీ కళాశాలల భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ విద్యాసంస్థలను స్థాపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అరుణ్, బాలు, సురేష్, విఠల్, వినోద్, లక్ష్మణ్, బులెట్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి ఫస్టియర్, గురువారం నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అధికారులు హాల్‌టికెట్లు విడుదల చేశారు. పరీక్ష కేంద్రాల్లో వసతులపై సమీక్షించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. మార్చి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎగ్జామ్స్ ఉంటాయి. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు.**

– అక్షరటుడే, ఇందూరు/కమ్మర్‌పల్లి



# రేపటి నుంచి ఇంటర్ ఎగ్జామ్స్

- జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు
- ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి నిరాకరణ


ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 58 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ అదే విధంగా, 8 మంది సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి సెంటర్‌లో ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఉంటారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు.

### అన్ని శాఖల సమన్వయంతో..

జిల్లా వ్యాప్తంగా రవాణా, విద్య, వైద్య, రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖల సమన్వయంతో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో తెలిపారు. పరీక్ష సమయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు. అలాగే పోలీసుల బందోబస్తు మధ్య ప్రశ్నా పత్రాలు, ఆన్సర్ షీట్లను తరలించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా.. కేంద్రంలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడితే తమ దృష్టికి తేవాలన్నారు.

### 36,963 మంది విద్యార్థులు

పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఎలాంటి ప్రింట్ మెటీరియల్ కానీ, సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు రావొద్దు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా మొత్తం 36,963 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అందులో ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 16,336, ఒకేషనల్ 2,963 మంది ఉన్నారు. సెకండియర్ జనరల్ విద్యార్థులు 14,893, ఒకేషనల్, ఒకేషనల్ స్టూడెంట్స్ 2,771 మంది ఉన్నారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు.



## ఉక్రెయిన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ టీం లీడర్‌గా ఎంపీ

**అక్షరటుడే, హైదరాబాద్:** పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ టీం లీడర్‌గా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి నియమితులయ్యారు. ఈ గ్రూప్ ద్వారా భారత్, ఉక్రెయిన్ దేశాల మధ్య పార్లమెంటరీ స్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, పరస్పర సహకారాన్ని పెంపొందించడం, అలాగే విద్య, వాణిజ్యం, సాంస్కృతిక రంగాలలో సహకార అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అర్వింద్ టీం లీడర్‌గా ఉన్న ఈ గ్రూపులో ఎంపీలు రంజన్ గొగోయ్, లక్ష్మీకాంత్ పప్పు నిషాద్, అమర్ శరద్రావ్ కాలే, ఖలీలుర్ రహమాన్, హనుమాన్ బేనివాల్, ప్రభా మల్లికార్జున్, శివమంగళ్ సింగ్ తోమర్, ఐ.ఎస్. ఇన్‌బదురై, రణదీప్ సింగ్ సుర్జేవాలా, సదానంద్ మ్హాలు తనవాడే సభ్యులుగా ఉన్నారు. బాధ్యతలు అప్పగించినందుకు ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజులకు అర్వింద్ ధన్యవాదాలు తెలియజేశారు.



## నీలకంఠేశ్వరాలయం హుండీ లెక్కింపు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ విజయ రామారావు పర్యవేక్షణలో మూడు నెలల హుండీ లెక్కింపు జరిగింది. మొత్తంగా రూ.4,40,228 జమ అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరాం రవీందర్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సిరిగిరి తిరుపతి, అభివృద్ధి కమిటీ సభ్యులు సిరిగిరి శంకర్, డాక్టర్ మదన్ మోహన్, ఆలయ అర్చకులు, సిబ్బంది, విష్ణు సహస్రనామ పారాయణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమాయకులపై అసాంఘిక శక్తుల దాడులను ఖండిస్తున్నాం..

**అక్షరటుడే, ఇందూరు :** అమాయక ప్రజలపై అసాంఘిక శక్తుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలిసి సీపీ సాయి చైతన్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హిందూ సమాజంపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కొద్దిరోజుల క్రితం బాన్సువాడ, మోపాల్ మండలం పరిధిలోని కాల్పోల్, రుద్రూర్, ఆనంద్ నగర్, ఇందూరు నగరంలోని మిర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో అమాయక ప్రజలపై జరుగుతున్న దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దాడులు జరిగినప్పటికీ సంబంధిత వ్యక్తులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటనలు జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మారుతున్నాయని తక్షణమే పోలీసు శాఖ స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. దాడులకు పాల్పడుతున్న వారిని కొందరు రాజకీయంగా కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని తమకు అనుమానం ఉందని దినేష్ ఆరోపించారు. పోలీసులు పక్షపాతరహితంగా వ్యవహరించి నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన కోరారు. తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డెక్కి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. జిల్లాలో అమాయకులపై జరిగిన దాడుల్లో నిజానిజాలు తెలిసేందుకు సీపీ తక్షణమే స్పెషల్ టీం ఏర్పాటు చేసి పూర్తిస్థాయి విచారణ జరపాలని దినేష్ కులచారి డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సున్నిత ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని పోలీస్ పహారా పెంచాలని ఆయన కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేసి వారికి పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ సభ్యులు ఓం సింగ్, గోపిడి వినోద్ రెడ్డి, కృష్ణ, మారెడ్డి వనిత సురేష్, ఆనంద్, విజయకృష్ణ, వినోద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలపై టీజీఈజేఏసీ హర్షం..

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ నిర్ణయంపై తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, కార్మిక, ఉపాధ్యాయ, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ నిజామాబాద్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం కమిటీ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత చికిత్స కోసం ఆరోగ్య కార్డులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చడం అభినందనీయమన్నారు. అలాగే 60ఏళ్ల లోబడి ఉన్న ఉద్యోగులందరికీ ప్రమాదంలో మరణించినట్లయితే రూ.కోటి, సాధారణ మరణం పొందినట్లయితే రూ.10 లక్షల జీవిత బీమాను అందించే సంస్కరణను తేవడంపై టీజీఈజేఏసీ కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ మంత్రులతో, ఐఏఎస్ ఉప సంఘ అధికారులను సమన్వయపరచుకొని, ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం కేబినెట్‌లో నిర్ణయాలు తీసుకునేందుకు కృషి చేసిన టీజీఈజేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్, కో ఛైర్మన్ ఏలూరు శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేని (ముజీబ్)కి, జేఏసీ నాయకులందరికీ ఎంప్లాయీస్ జేఏసీ నిజామాబాద్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి టీజీఈజేఏసీ అడిషనల్ సెక్రెటరీ జనరల్ మోహన్ రెడ్డి, కో-ఛైర్మన్లు ధర్మేందర్, నేతికుంట శేఖర్, నేరెళ్ల శ్రీనివాస్, బాలయ్య, కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ గోపాల్, టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారం, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, జేఏసీ కోశాధికారి జాకీర్ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ కుమార్, జమీలుల్లా, వనమాల సుధాకర్, రమణాచారి, ఒమాజీ, గంగాధర్, జాఫర్ హుస్సేన్, అశ్విన్ కుమార్, రాజీవ్, లక్ష్మీనారాయణ, మాణిక్యం, శశికాంత్ రెడ్డి, సృజన్ కుమార్, వినీత తదితరులు హాజరయ్యారు.



## ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాల్లో ఫోన్లకు అనుమతి లేదు..



**అక్షరటుడే, ఇందూరు:** పదో తరగతి వార్షిక పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల అనుమతి లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ లో మంగళవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి వాటికి ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఫోన్లు తీసుకువస్తే మెయిన్ గేటు వద్దనే స్వాధీనం చేసుకుని డిపాజిట్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు, విమర్శలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు నిర్వహించడంలో సీఎస్‌లు క్రియాశీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. తప్పనిసరిగా పోలీసు బందోబస్తు మధ్యే ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బయటి వ్యక్తులు ఎవరూ పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా సమయం ముగిసేంత వరకు లోపలి వ్యక్తులు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకునేలా వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతిగదిలో తప్పనిసరిగా తగినంత వెలుతురు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముదిరాజ్ మహాసభ బాన్సువాడ ఇన్‌ఛార్జీగా మంత్రి గణేష్ నియామకం



**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్‌కు చెందిన మంత్రి గణేష్ నియమితులయ్యారు. కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు భూపాల్ విజయానంద్ ముదిరాజ్ మంగళవారం ఆయనను అధికారికంగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భూపాల్ విజయానంద్ మాట్లాడుతూ ముదిరాజ్ సర్వతోముఖాభివృద్ధి కోసం బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మక ధోరణిలో విధులు నిర్వహిస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. సమాజంలోని యువత, మహిళలు, రైతులు, కార్మికుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మంత్రి గణేష్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముదిరాజ్ ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, పెద్దలు, యువకులు పాల్గొని మంత్రి గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పిల్లల హక్కుల పరిరక్షణపై అవగాహన



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని చిట్టాపూర్ గ్రామ పంచాయతీలో మంగళవారం బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం కమిటీ నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను అధికారులు వివరించారు. పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ల వరకు బాలబాలికలు ఎటువంటి శారీరక, మానసిక హింసకు గురికాకుండా వారి హక్కులు కాపాడుతూ భావి భారత పౌరులుగా ఎదగడానికి కమిటీ నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాట్ల గంగప్రవీణ్, ఉప సర్పంచ్ ఉదయ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, వీడీసీ ఛైర్మన్ రాజబాబు, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.



### ఇష్టారాజ్యంగా

# ఇటుక బట్టీలు..



- భీమ్‌గల్‌లో జోరుగా వ్యాపారం
- నిబంధనలకు పాతర
- వ్యవసాయ భూముల్లో కుంపట్లు..
- బట్టీల్లో మగ్గుతున్న బాల్యం
- అటవీ సంపద కొల్లగొట్టి అక్రమ విద్యుత్‌తో వ్యాపారం

**జిల్లాలోని భీమ్‌గల్ మండలంలో ఇటుక బట్టీల దందా మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, ఎటువంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో బట్టీలు వెలుస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మేజర్ గ్రామ పంచాయతీలు, మారుమూల గిరిజన తండాల్లో ఈ అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారుల కళ్లెదుటే అటవీ సంపద బుగ్గిపాలవుతున్నా, బాల్యం బట్టీల్లో మగ్గుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. – అక్షరటుడే, భీమ్‌గల్**

నిబంధనల ప్రకారం ఇటుక బట్టీని ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ జల, కార్మిక శాఖ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. కానీ భీమ్‌గల్‌లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. సారవంతమైన వ్యవసాయ భూముల్లో యథేచ్ఛగా మట్టిని తవ్వి ఇటుకలు తయారు చేస్తున్నారు. భూమి స్వభావాన్ని మార్చకుండానే కమర్షియల్ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

### యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం

బట్టీల వద్ద యంత్రాల నిర్వహణకు, కార్మికుల నివాసాలకు అవసరమైన విద్యుత్‌ను అధికారిక అనుమతులు లేకుండానే వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటుకలను కాల్చేందుకు యజమానులు అడ్డగోలుగా పెద్దపెద్ద వృక్షాలను నరికివేస్తున్నారు. పచ్చని చెట్లను ఇంధనంగా వాడుతూ పర్యావరణానికి తీవ్ర హాని తలపెడుతున్నారు.

### ఇతర రాష్ట్రాల నుంచి..

బట్టీల్లో పనిచేసేందుకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల కుటుంబాలు ఇక్కడ బతుకు వెళ్లదీస్తున్నాయి. వీరితో పాటు చిన్నారులు సైతం బట్టీల పనిలో నిమగ్నమవ్వడం ఆందోళన కలిగిస్తోంది. 'బాల కార్మిక వ్యవస్థ' నిర్మూలన చట్టాలు ఇక్కడ కాగితాలకే పరిమితమయ్యాయి. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో చిన్నారులు మట్టిలో మగ్గుతూ ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

### పట్టింపులేని అధికార యంత్రాంగం

గ్రామ పంచాయతీల నుంచి ఎటువంటి నిరభ్యంతర పత్రాలు లేకుండానే బట్టీలు నిర్వహిస్తున్నా స్థానిక యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మిక శాఖ తనిఖీలు లేకపోవడం, రెవెన్యూ విభాగం మౌనం వహించడం బట్టీ యజమానులకు వరంగా మారింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రకృతిని నాశనం చేస్తున్న ఈ అక్రమ బట్టీలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### అనుమతులు ఇవ్వలేదు

భీమ్‌గల్ మండలంలో ఇటుక బట్టీల నిర్వహణకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా ఇటుక బట్టలు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. నిబంధన విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహించరాదు. విద్యుత్ చౌర్యం, బాల కార్మికులతో పని చేయించడం, కలపను ఇష్టారీతిన తగలబెట్టడం సరైంది కాదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని చట్టరీత్యా ఆయా ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

**– షబ్బీర్, తహశీల్దార్, భీమ్‌గల్**

## రెంజర్లలో రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్లలో వాహనదారులకు పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బైక్ నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కిరణ్ పాల్ సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారాం, ముప్కాల్ పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** వాహనదారులు రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించి వాహనాలు నడపాలని ఆర్మూర్ ట్రాఫిక్ ఎస్సై రఘుపతి తెలిపారు. తెలంగాణ పోలీసు శాఖ రెండో విడత 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా షీటీం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మూర్ పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ప్రధాన కర్తవ్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐపీ యశీర్ అర్ధాఫ్, ఏఎస్సై సుశీల్ కుమార్, షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి పాల్గొన్నారు.

## ముప్కాల్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు




**అక్షరటుడే, ముప్కాల్:** ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ద్వారా ముప్కాల్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు లభించినట్లు అధ్యక్షుడు జక్కుల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ముప్కాల్ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలను కూడా నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

## నూతన సర్పంచులకు శిక్షణ తరగతులు



**అక్షరటుడే, ముప్కాల్:** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులకు ఈనెల 28 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని న్యాక్ అకాడమీలో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముప్కాల్ మండలం నుంచి ఆయా గ్రామాల సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఎట్టెం మహేష్, దాసరి గంగాధర్, బర్కుంటా గంగాధర్, బర్కం గంగాధర్, బొమ్మెన లావణ్య, కొమ్ముల సాయవ్వ, నిమ్మల రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి ఆలయంలో దేవనాద రామానుజ జీయర్ స్వామిచే తీర్థగోష్టి నిర్వహించగా, వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం ఘనంగా జరిగింది. అనంతరం స్వామివారు మాడవీధుల్లో పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేద పండితులు నందకిషోర్, అభిషేక్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు పోచారం శ్రీనివాసరావు రెడ్డి, శంభురెడ్డి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగలా సాగుతున్నాయి.

## లక్ష్మణ్ రాథోడ్‌కు ఇండియన్ బెస్ట్ ఇన్‌స్పిరేషన్ అవార్డు




**అక్షరటుడే, గాంధారి :** విద్యార్థులకు, క్రీడాకారులకు ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ.. వారి ఉన్నతికి విశేష కృషి చేస్తున్న జడ్పీహెచ్ఎస్ పేట్ సంగం పీఈటీ, బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్ష్మణ్‌రాథోడ్‌కు ఇండి యన్ బెస్ట్ ఇన్‌స్పిరేషన్ అవార్డు వరించింది. న్యూ ఢిల్లీకి చెందిన గ్యాన్ ఉదయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డును ఆయనకు అందజేసింది. ఈ మేరకు ఆయ న మంగళవారం వివరాలు వెల్లడించారు. మారు మూల గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి లక్ష్మణ్ రాథోడ్ బామన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యమే కాకుండా ఉన్నత స్థాయిలో ఉద్యోగం కూడా సంపాదించవచ్చని ఆయన క్రీడాకారులకు ఎల్లప్పుడూ సూచిస్తూ ఉంటారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న వారి సేవలను సర్వే చేసి తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఆయనకు అవార్డు రావడంపై ఫౌండేషన్ చీఫ్ ప్యాట్రన్ గుగ్లోత్ సురేందర్, ఎస్జీఫ్ సెక్రెటరీ హీరాలాల్, మాజీ జెడ్పీటీసీ శంకర్ నాయక్ తదితరులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం/బోధన్:** డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. పలువురికి భారీగా జరిమానా విధించింది. ఈ మేరకే నిజామాబాద్‌లో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. అనంతరం వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. ఇందులో ముగ్గురికి న్యాయమూర్తి వారంరోజుల పాటు జైలుశిక్ష విధించారు. అలాగే 21మందికి రూ.10వేల చొప్పున జరిమానాలు విధించారు. బోధన్ పట్టణంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. అతడికి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా అతడికి ఐదురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా బోధన్ పోలీసులు మాట్లాడుతూ..మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన..



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ :** న్యాయవాదిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని లాయర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ బోధన్ బార్ అసోసియేషన్‌లో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాది కళ్యాణిపై ఆదివారం రుద్రూర్‌లో గుండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడిపై న్యాయవాది రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం ఇంతవరకు దుండగులను అరెస్ట్ చేయకుండా ఉదాసీన వైఖరి అవలంభించడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న ఇలాంటి విషయాలు హింసాత్మక దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు, న్యాయవ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. మహిళా న్యాయవాదిపై దాడికి పాల్పడ్డ దుండగులను వెంటనే గుర్తించి, హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని వారు జగన్ మోహన్ గౌడ్ కోరారు. కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను న్యాయవాది పరిషత్ డిమాండ్ చేస్తోందన్నారు. అనంతరం బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం




**అక్షరటుడే, ఇందూరు:** శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గోవింద్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 190 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి దంత సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. దంత రక్షణ కోసం ప్రతిఒక్కరూ రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో కిడ్స్ మార్కెట్ నిర్వహణ





**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యాపార దృక్పథం, ఆత్మవిశ్వాసం, బాధ్యతాభావాన్ని పెంపొందించడం అభినందనీయమని ఎంఈవో నాగేశ్వర్ రావు అన్నారు. బాన్సువాడ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మంగళవారం చిన్నారుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'కిడ్స్ మార్కెట్' కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను కూడా నేర్పాలని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమన్వయ భావన, ఆర్థిక అవగాహన పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య నరేష్ మాట్లాడుతూ.. పిల్లల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు ప్రాయోజిక అనుభవాలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణుడు అచ్చుకట్ల జీవన్, మాజీ కౌన్సిలర్ నందకిశోర్, మాజీ ఎంపీటీసీ సాగర్ షిండే, పంతులు రాము, యండమూరి వరప్రసాద్, పాఠశాల సిబ్బంది పద్మ, తేజస్వి, రేఖ, సౌభాగ్య, వీణ, సునీత, మౌనిక, మనీషా, సవిత, మానస తదితరులు పాల్గొన్నారు.